సాక్షి
కర్నూలు
శనివారం । 15 । జూన్ । 2024



భ్రమరాంబకు ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలుగొందుతున్న శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు.



గో సంరక్షణకు రూ.లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: గో సంరక్షణ నిధికి శుక్రవారం ఖమ్మంకు చెందిన మోతుకూరి వెంకటేశ్వర్లు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఏలూరు అభినయ నృత్యభారతి బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ద్వారా ఖైదీలకు ఉచిత న్యాయ సేవలను అందిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌కు సంబంధించి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ తెలిపారు. పంచలింగాల గ్రామంలో జిల్లా జైలును, మహిళా జైలును శుక్రవారం వారు సందర్శించారు. అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడటానికి వచ్చేవారికి మాట్లాడే సదుపాయాన్ని పరిశీలించారు. న్యాయవాదులు ఎం.ఆంజనేయులు, పి.వెంకటేశ్వర్లు, పారా లీగల్ వాలంటీర్ వరలక్ష్మి, జైలు పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

చిప్పగిరి జెడ్పీటీసీ పదవికి ఎమ్మెల్యే విరూపాక్షి రాజీనామా



కలెక్టర్ సృజనకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

కర్నూలు(సెంట్రల్): చిప్పగిరి జెడ్పీటీసీ పదవికి ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి రాజీనామా చేశారు. ఈమేరకు శుక్రవారం తన రాజీనామా పత్రాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు అందించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బి.విరూపాక్షి ఆలూరు ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. రెండు పదవుల్లో ఒకదానికి రాజీనామా చేయాల్సి ఉండడంతో జెడ్పీటీసీ పదవి నుంచి వైదొలిగేందుకు నిర్ణయం తీసుకున్నారు. తనను చిప్పగిరి జెడ్పీటీసీగా ఏకగ్రీవంగా గెలిపించిన మండల ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని, భవిష్యత్‌లో వారి ప్రేమానురాగాలు తనపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఆర్‌యూ కాన్వొకేషన్ వాయిదా

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం (ఆర్‌యూ) కాన్వొకేషన్ వాయిదా పడింది. ఈనెల 21వ తేదీన కాన్వొకేషన్ నిర్వహించేందుకు ఆర్‌యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం 3,826 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడం, మంత్రి వర్గ విస్తరణ, అధికారుల మార్పు తదితర కారణాలతో కాన్వొకేషన్ నిర్వహణ వాయిదా పడింది. ఈ మేరకు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

చిరుసాగు.. ఆదాయం బాగు!

16 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు



ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా 100 శాతం ప్రకృతి వ్యవసాయంలో చిరుధాన్యాల సాగు చేసు చేసున్నాం. ఈ ఖరీఫ్‌లో 10 ఎకరాల్లో కొర్రలు, 4 ఎకరాల్లో అండుకొర్రలు, 2 ఎకరాల్లో ఆరికలు సాగు చేస్తున్నాం. మొదట్లో పత్తి విత్తనోత్పత్తి చేసినా కలసి రాకపోవడంతో చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాం. చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేశాం. మారుతున్న కాలానికి అనుగుణంగా చిరుధాన్యాల సాగు ఎంతో మేలు.

– వేణుబాబు, చిరుధాన్యాల రైతు

2023 ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగు ఇలా..

చిరుధాన్యాల పంట	కొర్రలు	సజ్జ	జొన్న	అండుకొర్రలు	ఊదలు	వరిగలు	రాగులు	మొత్తం
2023 (ఎకరాల్లో)	3,155	14,405	3,748	228	68	49	172	21,825



సాగులో ఉన్న కొర్ర

కొర్ర సాగుతో అదనపు ఆదాయం

- తక్కువ పెట్టుబడితో నికరాదాయం పొందే అవకాశం
- నల్ల రేగడి భూములను రబీ వరకు ఖాళీగా ఉంచుకోకుండా కొర్రలో రాణింపు
- ఇప్పటికే వందలాది క్వింటాళ్ల కొర్ర విత్తనం పంపిణీ
- గత ఏడాది కొర్ర 3,155 ఎకరాల్లో మాత్రమే సాగు
- ఈసారి 10 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం
- 50 శాతం సబ్సిడీపై విత్తన పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాల సాగుపై ఆసక్తి పెరుగుతోంది. ప్రత్యేకించి ఈ ఏడాది ఖరీఫ్‌లో కొర్ర సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. కొర్ర విత్తనానికి గతంలో ఎప్పుడూ లేని విధంగా డిమాండ్ ఉంటోంది. ఇప్పటికే కృషి విజ్ఞాన కేంద్రాలు, నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్‌ల నుంచి 10వేల ఎకరాలకు సరిపోయే విత్తనాలను పూర్తి ధర చెల్లించి రైతులు తీసుకోవడం విశేషం. సంప్రదాయ పంటలైన చిరుధాన్యాలు పోషకాలకు నెలవు. కొర్రలు, సాములు, అండుకొర్రలు, ఆరికెలు, ఊదలు, వరిగలను సిరిధాన్యాలుగా వ్యవహరిస్తారు. మనిషి ఆధునిక జీవనానికి అలవాటు పడటంతో చిరుధాన్యాల వినియోగం క్రమంగా తగ్గింది. ఫలితంగా ఆహారపు అలవాట్లు మారడంతో అనారోగ్య సమస్యలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో తిరిగి సిరిధాన్యాల వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. చిరుధాన్యాల్లో ప్రధానంగా కొర్ర స్వల్పకాలిక పంట కావడంతో సెప్టెంబర్ లోపు పూర్తి చేసుకొని రబీ సాగుకు అవకాశం ఉండటంతో రైతులు ఆ దిశగా ఆసక్తి చూపుతున్నారు. 10 ఏళ్ల క్రితం వరకు చిరుధాన్యాల వినియోగం 5–10 శాతం ఉండగా.. మారుతున్న పరిస్థితులతో వీటి వినియోగం 40–50 శాతంపైగా చేరుకుంది.

కొర్ర విత్తనాలకు పెరిగిన డిమాండ్

2023–24లో పండించిన కొర్రలకు మార్కెట్‌లో రూ.6 వేలకు పైగా ధర లభించింది. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా కొర్ర సాగు చేసిన రైతులకు లాభాలు పండాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం పొందడానికి అవకాశం ఉన్న కొర్ర సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో నల్లరేగడి నేలలు అధికం. ఖరీఫ్‌లో ఈ భూములను ఖాళీగా ఉంచుకొని రబీలో శనగ సాగు చేస్తారు. మూడు నాలుగేళ్లుగా కొర్రలో స్వల్పకాలిక రకాలు మార్కెట్‌లో రావడంతో జూన్, జూలై నెలల్లో కొర్ర సాగు చేసుకొని.. అక్టోబర్ నెలలో శనగ సాగుకు సిద్ధమవుతున్నారు. బనగానపల్లి మండలం యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఇప్పటికే 200 క్వింటాళ్ల కొర్ర విత్తనాలను రైతులకు పంపిణీ చేసింది. ఈ విత్తనం 5వేల ఎకరాలకు సరిపోతుంది. నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ ద్వారా కొర్ర విత్తనం పెద్ద ఎత్తున పంపిణీ అవుతోంది. 2024–25లో జిల్లాలో కొర్ర సాధారణ సాగు 1,684 హెక్టార్లు మాత్రమే. తాజాగా విత్తనాల డిమాండ్‌ను చూస్తే 10వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యాగంటిపల్లి, బనవాసి కేవీకేలతో పాటు నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్‌లో పలు కొర్ర స్వల్పకాలిక రకాలు అందుబాటులో ఉన్నాయి.

50 శాతం సబ్సిడీపై కొర్ర విత్తనాలు



మార్కెట్‌లో కొర్రలకు డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఖరీఫ్‌లో కొర్ర సాగును ప్రోత్సహించేందుకు ఏపీ సీడ్స్ ద్వారా సబ్సిడీపై ఎస్ఐఏ 3156 రకం విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నాం. కిలో పూర్తి ధర రూ.87.40 ఉండగా.. 50 శాతం సబ్సిడీ పోనూ రైతులు రూ.43.70 చెల్లించాలి.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

నికర ఆదాయం ఎక్కువ

గతేడాది నంద్యాల జిల్లా డోన్ మండలం ఎర్రగుంట్ల తదితర గ్రామాల్లో కొర్ర సాగు చేసిన రైతులు లాభాల పంట పండించుకున్నారు. ఖరీఫ్‌లో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద 49 మంది రైతులు 63 హెక్టార్లలో ఎస్ఐఏ 3156 రకం కొర్ర సాగు చేశారు. కెమికల్స్ లేకుండా 100 శాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేశారు. సురక్షిత పద్ధతులు పాటించడం వల్ల ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.5వేల వరకు మాత్రమే వచ్చింది. పంట దిగుబడులు ఎకరాకు 4–6 క్వింటాళ్ల వరకు వచ్చాయి. ఎలాంటి కెమికల్స్ లేకుండా కొర్ర పండించిన రైతులకు ఇండ్ గ్యాప్ ఆర్గానిక్ సర్టిఫికెట్లు జారీ చేశారు. మామూలు పద్ధతుల్లో పండించిన కొర్రలు క్వింటాకు రూ.5వేల–రూ.6వేల ధర లభించింది. డోన్ మండలంలో పండించిన కొర్రలకు రూ.7వేల ధర లభించడం విశేషం. ఎకరాకు రూ.5 వేల పెట్టుబడి పెట్టగా నికరాదాయం రూ.30వేల నుంచి రూ.38 వేల వరకు పొందారు.

సిరిధాన్యాల విశిష్టత



- సహజ పీచు పదార్థం కలిగి ఉండటమే కొర్ర ప్రత్యేకత.
- రోజుకు మనిషికి అవసరమైన పీచుపదార్థం (ప్రతి ఒక్కరికి రోజుకు 38 గ్రాముల పీచుపదార్థం అవసరం) కొర్ర నుంచే లభిస్తుంది.
- తక్కిన 10 గ్రాములు కూరగాయలు, ఆకు కూరల నుంచి పొందవచ్చు.
- చిరుధాన్యాలు ప్రత్యేకమైన రోగ నిరోధక శక్తి కలిగి ఉంటాయి.
- వరి, గోధుమలలో పీచుపదార్థం/ఫైబర్ 0.2 నుంచి 1.2 వరకు ఉంటాయి.
- ఇవి ధాన్యపు పైపొరలలోనే ఉండటం వల్ల పాలిష్ చేయడం ద్వారా పోతున్నాయి.
- సిరిధాన్యాలలో పీచుపదార్థం గింజమొత్తం అంతర్లీనంగా ఉండటం వల్ల ఆరోగ్యాన్ని చేకూరుస్తోంది.

పారిశ్రామికవేత్తకు పరిశ్రమల శాఖ

- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రిగా టీజీ భరత్



కర్నూలులో మంత్రి టీజీ భరత్‌కు ప్రత్యేక వాహనంలో స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

కర్నూలు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహచర మంత్రులకు శాఖలు కేటాయించారు. శాఖల కేటాయింపుపై మూడు రోజుల పాటు కసరత్తు చేసి ఎవరికి ఏ శాఖ కేటాయించింది శుక్రవారం మధ్యాహ్నం జీవో విడుదల చేస్తూ ప్రకటించారు. ఇందులో భాగంగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్‌కు పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖను కేటాయించారు. పరిశ్రమల నిర్వహణలో అనుభవం ఉన్న టీజీ భరత్‌కు రాష్ట్ర మంత్రి వర్గంలో పరిశ్రమల శాఖ కేటాయించడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 1952లో ఏర్పడిన కర్నూలు నియోజకవర్గానికి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందిన వారిలో రాంభూపాల్ చౌదరి కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో మొదటి విడత, నాదెండ్ల భాస్కర్ రావు మంత్రి వర్గంలో రెండవ విడత నెల రోజుల పాటు మంత్రిగా పనిచేశారు. అలాగే 2009 నుంచి 2014 మధ్య కాలంలో రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో టీజీ వెంకటేష్ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. మంత్రి పదవి దక్కించుకున్న మూడో వ్యక్తిగా టీజీ భరత్ గుర్తింపు పొందారు.

పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా

జిల్లా అభివృద్ధితో పాటు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని మంత్రి టీజీ భరత్ అన్నారు. మంత్రి హోదాలో మొదటిసారి జిల్లాకు వచ్చిన టీజీ భరత్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కర్నూలుకు రాగానే ప్రత్యేక వాహనంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయని, వారితో సమన్వయం చేసుకుని జిల్లా అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. విజయవాడ నుంచి కర్నూలుకు విమాన సౌకర్యం కల్పించాలని విమానయాన శాఖ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరినట్లు చెప్పారు. కర్నూలు జిల్లాలో సాగునీరు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు, పత్తికొండ, ఆదోని, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, పార్థసారథి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కర్నూలు సిటీ: జిల్లాలోని మున్సిపల్ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషాపండితులుగా పనిచేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తయారు చేసిన జనరల్ సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ కె.శామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో వివరాలను సరి చూసుకోవాలని పేర్కొన్నారు.

17 నుంచి ఒలింపిక్‌డే సంబరాలు



ఒలింపిక్ డే లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): ఒలింపిక్ డే సంబరాలను ఈనెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్ఎంబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఒలింపిక్‌డే సంబరాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు సుధీర్, నాగరత్నమయ్య, వంశీ, వెంకటేష్, గంగాధర్, చిన్న సుంకన్న, సువర్ణ, నబీ సాహెబ్, షేక్షావలీ, షకీల్ పాల్గొన్నారు.

అపోహలు వీడి రక్తదానం చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్): యువతీయువకులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల, డివిజన్ స్థాయిల్లోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా ఆసుపత్రిలో చేరితే చూసేందుకు పదుల సంఖ్యలో వస్తారని, రోగికి రక్తం అవసరమైతే మాత్రం ఎవ్వరూ ముందుకు రావడం లేదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రక్తం ఇస్తేనే రక్తసంబంధీకులు అవుతారన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం 5 కోట్ల యూనిట్ల రక్తం అవసరమైతే 3.5కోట్ల యూనిట్ల రక్తం మాత్రమే ఇవ్వగలుగుతున్నారన్నారు. రక్తదాన కార్యక్రమాన్ని ప్రోత్సహించిన వారికి కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్, రెడ్‌క్రాస్ సొసైటీ ట్రెజరర్ రఘునాథరెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు అరుణ, మధుసూదన్, ప్రభాకర్‌రెడ్డి, నరసింహ, భీమశంకర్‌రెడ్డి, ఎం.జె.బాబురాజు, కేవీ సుబ్బారెడ్డి, మీనాక్షి, సెక్రటరీ వెంకటకృష్ణుడు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కుమారస్వామిరెడ్డి, డాక్టర్ రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు, ఐఎంఏ అధ్యక్ష, కోశాధికారులు డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, డాక్టర్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో...

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో ఘనంగా నిర్వహించారు. అనంతపురానికి చెందిన మానవత రక్తదాతల సంస్థ ఆధ్వర్యంలో కర్నూలు పట్టణంలోని రక్తదాతల సంస్థలకు అభినందన, జ్ఞాపికలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకరరెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, మానవత రక్తదాతల సంస్థ అధ్యక్షులు తరిమెల అమరనాథ రెడ్డి, కన్వీనర్ నగరి నవీన్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ వై. శ్రీధర్ పాల్గొన్నారు.

హమ్మయ్యా.. దాహం తీరింది!

- ముందుగానే కరుణించిన వరుణుడు
- మే, జూన్ నెలల్లో అధికంగా నమోదైన వర్షపాతం
- జిల్లాలోని 26 ఎస్ఎస్ ట్యాంకులకు చేరుతున్న వర్షపు నీరు
- ప్రస్తుతం అన్ని గ్రామాల్లో అవసరాల మేరకు తాగునీరు
- ఫలితాలనిచ్చిన అధికారుల ముందస్తు చర్యలు



బాపురం రిజర్వాయర్‌లో పెరుగుతున్న నీటి మట్టం

కర్నూలు(అర్బన్): వరుణుడి కరుణతో జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయి. మే నెలలో ఆకాల వర్షాలు కురవగా.. జూన్‌లో నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఆశించిన మేర వర్షాలు కురుస్తుండటంతో ప్ర'జల' కష్టాలు తొలగిపోయాయి. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు తీవ్ర రూపం దాల్చడంతో తాగునీటి సమస్య అధికంగా ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆందోళనకు గురయ్యారు. ప్రధానంగా మార్చి నెలలో రెండు మండలాల్లోని 8 గ్రామాల్లో, ఏప్రిల్‌లో 13 మండలాల్లోని 55 గ్రామాలు, మేలో 15 మండలాల్లోని 112 గ్రామాలు, జూన్‌లో 20 మండలాల్లోని 128 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు ఉంటాయని అప్పట్లోనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఆయా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రణాళికలు రూపొందించారు. అయితే అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు, వర్షాలు ముందుగానే రావడంతో అనేక గ్రామాల్లో నీటి సమస్య పెద్దగా కనిపించలేదు. తుంగభద్ర దిగువ కాలువ ద్వారా మన వాటాగా రావాల్సిన 1.49 టీఎంసీల్లో ప్రతి రోజు 480 క్యూసెక్కుల ప్రకారం 0.93 టీఎంసీల నీటిని తీసుకొని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపుకున్నారు. అలాగే ఎల్ఎల్‌సీ నీటితో గాజులదిన్నె ప్రాజెక్టును, హెచ్ఎన్ఎస్ఎస్ నీటితో గార్గేయపురం చెరువుకు నీటిని విడుదల చేయించడంతో వేసవిలో మొత్తం 23 గ్రామాలకు మించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. ప్రస్తుతం ఏ గ్రామంలో కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం లేదు. అలాగే వివిధ గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద 466 పనులు చేపట్టడంతో కూడా ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తలేదు. కాగా.. వేసవిలో జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా గత ప్రభుత్వం రూ.11.21 కోట్లను మంజూరు చేసింది.

ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంకుల్లో ఉన్న నీటి నిల్వలు...

2 ట్యాంకుల్లో 75 శాతం	15 ట్యాంకుల్లో 50 నుంచి 75 శాతం
3 ట్యాంకుల్లో 25 నుంచి 50 శాతం	6 ట్యాంకుల్లో 25 శాతం

ఇప్పటి వరకు కురిసిన వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మే నెల సాధారణ వర్షపాతం 40.10 మి.మీ కాగా.. 103.07 మి.మీ కురిసింది (159 శాతం అధికం)	జూన్ నెల సాధారణ వర్షపాతం 77.07 మి.మీ కాగా.. ఇప్పటి వరకు 121.29 మి.మీ కురిసింది. (57 శాతం అధికం)

ఎస్ఎస్ ట్యాంకుల్లోకి చేరుతున్న వర్షపు నీరు

కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని 26 ఎస్ఎస్ ట్యాంకుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆయా ట్యాంకుల పరిధిలోని 33 సీపీడబ్ల్యూఎస్ స్కీంల ద్వారా 339 జనావాసాల్లోని ప్రజలకు రక్షిత మంచి నీటిని అందిస్తున్నారు. ఎస్ఎస్ ట్యాంకుల్లో ఎల్ఎల్‌సీ నీరు తగ్గిపోతుందనే సమయానికి వర్షాలు ప్రారంభం కావడంతో ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.



మంచాల ఎస్ఎస్ ట్యాంకులో చేరిన వర్షపు నీరు

తాగునీటి సమస్యను అధిగమించాం



ఈ ఏడాది వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారుల సమన్వయంతో ఎల్ఎల్‌సీ నీటితో ఎస్ఎస్ ట్యాంకులను నింపాం. వివిధ ప్రాంతాల్లో జలజీవన్‌మిషన్ పనులను పూర్తి చేయడంతో తాగునీటి సమస్యను తీర్చగలిగాం. ఈ నెల 10వ తేదీ వరకు పెరవలి గ్రామంలో మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశాం. ఎన్నడూ లేని విధంగా గార్గేయపురం చెరువును 93 శాతం హంద్రీ–నీవా నీటితో నింపాం.

– బీ నాగేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 91 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు శుక్రవారం 91 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 1,646 మందికి 1,499 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. కర్నూలు శంకరాస్ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒక విద్యార్థి చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

ఎల్‌ఆర్ తహసీల్దార్‌కు బ్రెయిన్‌స్ట్రోక్

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని ల్యాండ్ రిఫార్మ్స్ విభాగం తహసీల్దారు వెంకటేశ్వర్లు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. నంద్యాల జిల్లాకు చెందిన ఆయన ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం ఉన్నఫళంగా కుప్పకూలారు. వెంటనే ఆయనను డిప్యూటీ తహసీల్దారు దివాకర్‌రావు, తదితరులు స్థానిక ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనట్లు నిర్ధారించి శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పరిశీలనలో ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి ఆస్పత్రికి వెళ్లి వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందజేయాలని సూచించారు.

సిలిండర్ పేలి గుడిసె దగ్ధం




కాలిబూడిదైన గుడిసె

మహానంది: ఉదయం కూలీపనులకు వెళ్లొచ్చిన తల్లీ, కుమారుడు వారి గుడిసెలో నిద్రిస్తుండగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే తేరుకుని బయటికి రాగా కాసేపటికే సిలిండర్ పేలడం, అదృష్టవశాత్తు తల్లీ, కుమారుడు ప్రాణాలతో బయటపడిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున గాజులపల్లెలో చోటు చేసుకుంది. గ్రామ ఎస్సీ కాలనీలో ఆదిలక్ష్మి, ఆమె కుమారుడు నరసింహులు ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో ఉలిక్కిపడి లేచిన కేకలు వేస్తూ బయటికి రాగా స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగానే సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. కాలనీవాసులు నంద్యాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వాహనంతో గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అగ్నిప్రమాదంలో రూ. 40వేల నగదుతో పాటు బంగారు కమ్మలు, వస్త్రాలు, బియ్యం బూడిదపాలయ్యాయి. దీంతో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, తహసీల్దార్ రామచంద్రుడు, అధికారులు గ్రామానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. ఎంపీపీ బాధితులకు రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు.

ఆశలన్నీ తుంగభద్ర జలాశయంపైనే!

- ఈ ఏడాది 172 టీఎంసీలకు అంచనా
- ఎల్ఎల్‌సీకి 19.4, కేసీకి 8.1 టీఎంసీల కేటాయింపు
- వచ్చే నెల మొదటి వారానికి ఆశాజనకంగా నీటి చేరికలు
- డ్యాం సామర్థ్యం 40 టీఎంసీలకు చేరిన వెంటనే కాల్వలకు నీటి విడుదల
- సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్న ఆయకట్టుదారులు



తుంగభద్ర జలాశయం

కర్నూలు సిటీ: ఈ ఏడాది ముందస్తుగానే వరుణుడు కరుణించాడు. సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో ఆశాజనకంగా కొనసాగుతోంది. దీంతో జలాశయంపై జిల్లా రైతులు ఆశలు పెట్టుకున్నారు. నైరుతి రుతు పవనాలు గతేడాది కంటే ముందుగానే ఈ ఏడాది విస్తరించాయి. వర్షాలు కురుస్తుండటంతో ఆయకట్టుదారులు ముందుగానే భూములను సిద్ధం చేసుకున్నారు. వర్షాలు ఆశించినంత మేర కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. అంతేకాకుండా ఈ నెల 1వ తేదీ నుంచే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం మొదైలంది. దీంతో తుంగభద్ర దిగువ కాలువ, కేసీ కెనాల్ ఆయకట్టుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

నీటి లెక్కల అంచనా

గత నీటి సంవత్సరాల గణాంకాల ఆధారంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు తుంగభద్ర జలాశయానికి ఎంత మేరకు నీటి లభ్యత ఉంటుందో అంచనా వేస్తారు. ఇందుకు తుంగభద్ర బోర్డు సమావేశం ఏర్పాటు చేస్తారు. నీటి లభ్యత అంచనా వేసిన నీటిని దమాషా ప్రకారం కేటాయింపులు చేస్తారు. టీబీ డ్యాం నిర్మాణం జరిగినప్పటి నుంచి నీటి లభ్యతలో 75 శాతం మాత్రమే పరిగణనలోకి తీసుకుని టీబీ బోర్డు ఇంజినీర్లు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పర్యవేక్షక ఇంజినీర్ల సమావేశం ఏర్పాటు వాటా కేటాయింపు చేస్తున్నారు. గతంలో తుంగభద్ర జలాలను ఎగువ రాష్ట్రాల్లో విచ్చలవిడిగా చౌర్యం చేస్తుండడంతో కేటాయించిన వాటా నీరు కూడా అందని పరిస్థితులు ఉండేవి. గత ప్రభుత్వం నీటి కేటాయింపుల మేరకు ప్రత్యేక నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసింది. టీబీ డ్యాం నుంచి నీటి విడుదల చేసిన తరువాత కాల్వలపై టెలీమెట్రీలు ఏర్పాటు చేసి నీటి ప్రవాహలను లెక్కించింది. దీంతో గతంలో కంటే జిల్లాకు నీటి చేరికలు పెరిగాయి.

కేటాయింపులు ఇలా..

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర డ్యాం. 105 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ డ్యాం నుంచి అనంతపురం జిల్లాలోని ఎగువ కాల్వల(హెచ్చెల్సీ)కు 32 టీఎంసీలు, భైరవానితిప్పకు 4 టీఎంసీలు, కర్నూలు జిల్లాలో దిగువ కాలువ(ఎల్ఎల్‌సీ)కు 24 టీఎంసీలు, ఆర్డీఎస్ కుడి కాలువకు 4 టీఎంసీలు, కేసీ కాల్వకు 10 టీఎంసీల నికర జలాల వాటా ఉంది. మొత్తం 74 టీఎంసీల నీరు రాయలసీమ జిల్లాలకు రావాల్సి ఉంది. అయితే డ్యాం పూడిక చేరిందనే కారణంగా చేత 132 టీఎంసీల సామర్థ్యాన్ని 105 టీఎంసీలకు తగ్గించారు. ఈ ఏడాది నీటి లభ్యత 172 టీఎంసీలకు అంచనా వేసి నీటి కేటాయింపులు చేశారు. ఈ ప్రకారం ఎల్ఎల్‌సీకి 19.47 టీఎంసీలు(1.51 లక్షల ఎకరాల ఆయకట్టు), కర్నూలు-కడప కాలువకు 8.113 టీఎంసీలు(కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు) కేటాయించారు. ఈ వాటాలతో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు సాగు నీటిని అందించే ఆర్డీఎస్ కాలువకు 5.282 టీఎంసీల ప్రకారం నీటిని కేటాయింపులు చేశారు.

జూలైలో నీటి విడుదల?

తుంగభద్ర డ్యాంలోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఇదీ మరింత ముమ్మరంగా కొనసాగే అవకాశం ఉన్నట్లు టీబీ బోర్డు ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుస్న నీటి ప్రవాహం వచ్చే వారంలో భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 5.91 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా, 37,37 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సాధారణంగా డ్యాంలో 40 టీఎంసీలకుపైగా నీటి సామర్థ్యం ఉండి, డ్యాంలోకి ప్రవాహం సైతం భారీగా ఉంటే జూలై రెండో వారంలోనే నీటిని కాల్వలకు విడుదల చేసే అవకాశం ఉంది.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

- గతంలో ఎదిరింటివారి కొట్లాటలో గాయపడిన ప్రకాశమ్మ
- తాజాగా గుండె నొప్పితో మృత్యువాత



మృతురాలు ప్రకాశమ్మ

రుద్రవరం: మండల పరిధి ఎల్లావత్తుల గ్రామానికి చెందిన జంగా ప్రకాశమ్మ(60) అనుమానాస్పద స్థితిలో మరణించింది. రుద్రవరం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఈ నెల 10న ప్రకాశమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట కూర్చుని ఉండగా పాత కక్షల నేపథ్యంలో ఎదురింట్లో ఉంటున్న జంగం నరసింహ్మారావు, నరసింహ్ముడు అనే అన్నదమ్ములు గొడవకు దిగారు. దుర్భాషలాడుతుండటంతో ఎందుకలా తిట్టుకుంటున్నారని ప్రకాశమ్మ ప్రశ్నించడంతో టెంకాయ మట్టతో ఆమెపై దాడి చేయగా గాయాలపాలైంది. ఇంతలో కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో వాళ్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రకాశమ్మకు స్థానికంగా, గాజులపల్లెలోని ప్రయివేట్ వైద్యుల వద్ద చికిత్స చేయించారు. శుక్రవారం గుండెల్లో నొప్పి అంటూ కుప్పకూలడంతో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. తన భార్య ఎదురింటి వాళ్ల దాడిలో తగిలిన దెబ్బలతో మరణించిందని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముందుగా గుర్తిస్తే చికిత్స సులభం



డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్‌తో శిక్షణకు హాజరైన వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ లక్షణాల గురించి మాట్లాడుతూ.. రొమ్ములు పరిమాణంలో, ఆకారంలో మార్పులుంటే, చర్మంపై, చనుమొనల చుట్టూ ఎర్రగా మారితే వెంటనే వైద్యులకు చూపించుకోవాలని తెలిపారు. బాధితులను గుర్తించి చికిత్స అందిస్తే వారి జీవితాన్ని పొడిగించిన వా రమవుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ కార్యక్రమ అధికారిణి హేమలత, డాక్టర్ సాయిమాధురి, డాక్టర్ చైతన్యవాణి, డాక్టర్ నిఖత్ నస్రీన్, డా క్టర్ మంజూషా, డాక్టర్ తులసీబాయి, ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ అధికారి డాక్టర్ నాగరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలులో అముక్త జ్యువెలరీ షో రూమ్

- ఈ నెల 16 వరకు బంగారం, వజ్రాభరణాల ఎగ్జిబిషన్



షోరూంను ప్రారంభిస్తున్న కస్టమర్లు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో అధునాతనంగా తీర్చిదిద్దిన అముక్త(బై సుధా అన్నపురెడ్డి) జ్యువెలరీ షో రూమ్‌ను స్థానిక కస్టమర్లు, ఎన్‌ఆర్ఐ కస్టమర్లచే ప్రారంభోత్సవం నిర్వహించారు. స్థానిక బుధవారపేటలోని కెనరా బ్యాంకు భవనం సెకెండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన అముక్త జ్యువెలరీ, డైమండ్ షోరూమ్‌ను శుక్రవారం వినియోగదారులు కేజే మణిరెడ్డి, వీణారెడ్డి, అరుణారెడ్డి, శైలాజారెడ్డిలతో పాటు ఎన్ఆర్ఐ కస్టమర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ ప్రొప్రైటర్ సుధారాణి మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం 5 కిలోల బంగారంతో అముక్త కలెక్షన్ పేరుతో జ్యువెలరీ వ్యాపారం ప్రారంభించామన్నారు. అనతి కాలంలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు డైమండ్, పోల్కి, కుందన్, నక్ష తదితర ఆభరణాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. బంగారం, వజ్రాభరణాలను అముక్త బై సుధా అన్నపురెడ్డి బ్రాండ్‌గా తయారు చేస్తున్నట్లుగా స్పష్టం చేశారు. రాష్ట్రం మొత్తం మీద ఈ ఏడాది 30 ఎగ్జిబిషన్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బంగారం వ్యాపారానికి సంబంధించి ఎక్స్‌పోర్ట్, ఇంపోర్టు(ఐఇసీ) లైసెన్స్ కూడా ఉందన్నారు.

పడగొట్టారు సరే..నిర్మించేదెప్పుడు?

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పాఠశాలను కూల్చేసిన అధికారులు.. ప్రత్యామ్నాయం చూపడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపారు. ఏడాది క్రితమే నూతన భవన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ(ఎన్‌హెచ్ఏఐ) రూ.64 లక్షలు ఇచ్చినా.. భవనం నిర్మాణం కాదుకదా కనీసం స్థల సేకరణ కూడా చేయక పోయారు. దీంతో కూల్చేయగా మిగిలిన ఒకే గదిలో 1 నుంచి 5వ తరగతులను ఎలా నిర్వహించాలో తెలియక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.



శిథిలాల మీదుగా వాస్‌రూంకు వెళ్తున్న విద్యార్థులు

- నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా పాఠశాల కూల్చివేత
- ఏడాది క్రితమే జేసీ ఖాతాలో రూ.60 లక్షలు జమ చేసిన ఎన్‌హెచ్ఏఐ
- ప్రత్యామ్నాయంపై దృష్టి సారించని విద్యాశాఖ అధికారులు
- ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహణ



కూల్చివేయగా మిగిలిన ఒకే తరగతి గది



ఇరుకు గదిలోనే పిల్లలకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయినులు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామ ఎంపీపీ స్కూల్‌కు 4 తరగతి గదులు, కాంపౌండ్, మల, మూత్రశాలలు ఉండేవి. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న 60 విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు బోధించేవారు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా ఎండాకాలం సెలవుల్లో పాఠశాలకు సంబంధించిన 3 తరగతి గదులను కూల్చేశారు. ప్రత్యామ్నాయ పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేయాల్సిన అధికారులు తమకు పట్టనట్లు ఉండటంతో పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమిగాటని నిలదీస్తున్నారు.

మూడేళ్ల క్రితమే తెలిసినా..

నేషనల్‌హైవే నిర్మాణ పనులు మూడేళ్ల క్రితం నుంచి జరుగుతున్నాయి. పాఠశాల భవనాన్ని కూల్చాల్సి వస్తుందని కూడా అధికారులకు తెలుసు. ఈక్రమంలోనే ఏడాది క్రితమే మరో పాఠశాల భవన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులు జిల్లా జాయింట్ కలెక్టర్ బ్యాంకు ఖాతాకు రూ.64 లక్షలు జమ చేశారు. అయినప్పటికీ స్థల సేకరణ చేపట్టకపోవడం, భవన నిర్మాణంపై శ్రద్ధ తీసుకోకపోవడంతో విద్యార్థులకు సమస్య వచ్చిపడింది. మరోవైపు విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి కూలిన మొండి గోడలను చూసి తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పటికే ఆరుగురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పీఎంసీ ద్వారా పనులు జరగాలి

పాఠశాల భవనం నిర్మాణం పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో జరగాల్సి ఉంది. ఇంత వరకు స్థలం సేకరించలేదు. ఇక భవనం నిర్మాణం ఎప్పుడనేది పెద్ద ప్రశ్నగా మారింది. జులైలో కొత్త పీఎంసీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ కమిటీ బ్యాంకు ఖాతా తెరవాలి. అప్పుడు జేసీ ఖాతాలోని డబ్బు వారి ఖాతాకు జమ కావాలి. ఆ తర్వాతే పనులు ప్రారంభించాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల భవన నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదపుటంచున..

పాఠశాల కూల్చిన కాంట్రాక్టర్ వేస్టేజ్‌ను తరలించకుండా అలాగే వదిలేయడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాష్ రూం పాఠశాల భవనం వెనుక ఉంది. వాష్ రూంకు విద్యార్థులు కూల్చిన భవనం గోడల మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి. పాఠశాల పక్కనే పంట కాల్వ ఉండటంతో విషసర్పాల సంచారం కూడా ఉంది. పిల్లలు బయటకు వెళ్లి తరగతి గదిలోకి వచ్చేంత వరకు ఉపాధ్యాయులకు ఆందోళనే.

జిల్లా అధికారులు ఏం చేస్తున్నారో?



ఏడాది క్రితమే జిల్లా జాయింట్ కలెక్టర్ అకౌంట్లో డబ్బు పడితే స్కూల్ నిర్మాణానికి స్థలం కొనుగోలు చేయకుండా అధికారులు ఏం చేస్తున్నారో?. డబ్బున్న వాళ్లు ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తారు. మాలాంటి పేదలు రూ.వేలల్లో ఫీజు కట్టి ప్రైవేటు స్కూళ్లలో చేర్పించలేక బడి మాన్పించే పరిస్థితి ఉంది. – సురేష్, గ్రామస్తుడు

డీఈఓకు ప్రతిపాదనలు పంపాం



స్కూల్ గురించి ఎంపీడీఓకు, డీఈఓకు లెటర్ పంపాం. ఎంపీడీఓ కూడా డీఆర్‌ఓకు లెటర్ పంపారు. ఇప్పటికే కంపెనీ వారు రూ.64 లక్షలు జేసీ అకౌంట్లో జమ చేసి ఉన్నారు. ఆ డబ్బు మండల కమిటీకి రావాలి. అక్కడి నుంచి పీఎంసీకి చేరాలి. ఆ తర్వాత పనులు ప్రారంభం కావాల్సి ఉంది. స్థలం ఎవరైనా దాతలిస్తే వారి పేరు వీద నిర్మాణం చేపడతాం. ఉచితంగా ఎవరూ ఇవ్వకపోతే మండల కమిటీ ద్వారా కొనుగోలు చేస్తాం. – బాలాజీనాయక్, ఎంఈఓ

బైక్‌పై తరలిస్తున్న సారా పట్టివేత

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం తొగర్చేడు గ్రామం వద్ద జరిపిన తనిఖీల్లో బైక్‌పై తరలిస్తున్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. బైక్‌ను వదిలేసి పారిపోయిన ఉల్లిందకొండ శ్రీనునాయక్ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, సారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిపై తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చే వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది అన్వర్‌బాషా, గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్, హనుమంతు, అప్రోజ్‌బాషా, తిరుమలేస్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మధ్య భగ్గుమన్న విభేదాలు

- సామాన్యుడి దుస్తుల దుకాణానికి నిప్పు
- రూ.5లక్షలకు పైగా నష్టం



కాలిపోయిన దుకాణం

కొలిమిగుండ్ల: టీడీపీ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. దీంతో సామాన్యుడికి చెందిన దుస్తుల దుకాణానికి నిప్పు పెట్టడంతో కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధిలోని కనకాద్రిపల్లెలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి వ్యాపారాల నిమిత్తం అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఉంటున్నారు. అక్కడే టీడీపీలో కొనసాగుతున్నారు. గతంలో ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. లావాదేవీల విషయంలో ఇద్దరి మధ్య బేదాభిప్రాయాలు ఉన్నాయి. కనకాద్రిపల్లెలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇంటిని కృష్ణమూర్తి రాఘవరాజుపల్లెకు చెందిన నాగేంద్రకు అద్దెకు ఇచ్చాడు. రెండేళ్ల నుంచి అతను ఆ ఇంట్లో బట్టల దుకాణం నడుపుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరెడ్డి తన అనుచరులతో కలిసి బట్టల దుకాణం షెట్టర్‌ను తొలగించి, అద్దాలు ధ్వంసం చేశారు. వెంట తీసుకెళ్లిన పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో బట్టలు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైరింజన్‌ను తెప్పించారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రూ.5లక్షలకు పైగానే నష్టం వాటిల్లిందని బాధితుడు నాగేంద్ర వాపోయాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకటేశ్వరరెడ్డితో పాటు మరికొందరు టీడీపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది.

కన్నకొడుకే కాడెద్దాయె..!



పాండవగల్ సమీపంలో వేరుశనగ పొలంలో దెంతె పాస్తున్న తండ్రీకొడుకు

ఆదోని అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో అన్నదాతలు పంటలసాగులో నిమగ్నమయ్యారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు ఎద్దులు, ట్రాక్టర్లు, యంత్రాల ద్వారా వ్యవసాయ పనులు చేస్తుండగా ఎలాంటి ఆసరా లేని వారు సైతం స్వయంశక్తితో నేలతల్లిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్నారు. పెట్టుబడుల కోసం చేతిలో చిల్లిగవ్వలేని ఆదోని మండలం పాండవగల్ గ్రామానికి చెందిన రైతు మూకయ్య, కొడుకు రామరాజు సాయంతో స్వశక్తిని నమ్ముకుని వేరుశనగ పంటను సాగు చేశాడు. శుక్రవారం పొలంలో కొడుకు రామరాజు కాడెద్దుగా మారి దెంతెను లాగుతుండగా తండ్రి మూకయ్య దెంతెను సాళ్ల మధ్యలో తొక్కిపట్టి దున్నే పనిలో నిమగ్నమయ్యారు. దీనిపై రైతు మూకయ్యను పలకరించగా గతేడాది కరువుతో వ్యవసాయంలో నష్టం వాటిల్లి అప్పులపాలైనట్లు చెప్పారు. ఎద్లతో దెంతె పాసేందుకు ఎకరానికి రూ.1500 వరకు ఖర్చవుతుందని, ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో కుమారుడితో కలిసి దెంతె పడుతున్నట్లు ఆవేదనతో చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందడంతో ఎలాంటి సమస్య ఉండేది కాదని, ఇప్పుడు ప్రభుత్వం మారిపోవడంతో ఇప్పటివరకు సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.